

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 13 ఫిబ్రవరి 2024



విజృంభిస్తున్న మంప్స్

● అల్లాడిపోతున్న పిల్లలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తిలో గవదలమ్మ (మంప్స్) విజృంభిస్తోంది. వారం రోజుల నుంచి పిల్లల్లో అత్యధికంగా ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తున్నాయి. ఒకరి నుంచి ఒకరికి వేగంగా వ్యాపిస్తుండడంతో పిల్లలు అల్లాడిపోతున్నారు. దవడలు వాచిపోవడం తోపాటు జ్వరం సోకుతుండడంతో నీరసించిపోతున్నారు.గవదలమ్మ పారామిక్సో వైరస్‌తో మొదలై తర్వాత చెవులకు దగ్గరగా ఉండే పరోటిడ్ గ్రంథిపై ప్రభావం చూపుతుంది. గవదల వాపు రావడం జరుగుతుంది. కొందరిలో సెంట్రల్ న్యూరల్స్ సిస్టం (మెదడు)పై ప్రభావం చూపి ప్రాణాంతకంగా కూడా పరిణమించే ప్రమాదం ఉంది. ఈ వైరస్ ఒకే గదిలో దగ్గరగా ఉన్నవారికి, అలాగే జలుబు, దగ్గు ఉన్నవారి నుంచి వ్యాపిస్తుంది. వైరస్ సోకిన వారం రోజుల తర్వాత లక్షణాలు బయటపడతాయి. వందలాది ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గాలి, వెలుతురు సక్రమంగా లేని తరగతి గదుల్లో చదువుకునే పిల్లలపై మంప్స్ ప్రభావం చూపు తోంది. వారం రోజుల నుంచి పిల్లలు గవదలు వాచిపోయి జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. వైరస్ సోకిన వారిని ఎవరితో కలవకుండా చూసుకోవాలి. ముఖ్యంగా పాఠశాలల్లో ఈ జాగ్రత్తలు విధిగా పాటించాలి. సంబంధిత అధికారులు అవగాహన కల్పించడం తోపాటు తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



వాచిన బాలుడి దవడ



అప్రమత్తంగా వ్యవహరించాలి

పిల్లల్లో మంప్స్ వ్యాధిపై పెద్దలు అప్రమత్తంగా వ్యవహరించాలి. తీవ్ర సమస్యకు దారి తీసే ప్రమాదం ఉంటుంది కాబట్టి మొదటి దశలోనే గుర్తించి జాగ్రత్తలు పాటించాలి. సహజ పద్ధతిలో వేపాకు, పసుపు మిశ్రమాన్ని అద్దవచ్చు.ఇతర పిల్లలతో కలవకుండా చూసుకోవాలి. మాంసాహారానికి దూరంగా ఉంచాలి. శరీరం వైరస్ ప్రభావంతో నీరసంగా మారుతుంది కాబట్టి ఆరు రోజులు ద్రవ పదార్థాలను అధికంగా తాగించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న పిల్లల విషయంలో తప్పనిసరిగా వైద్యులనుసంప్రదించాలి.

- డాక్టర్ వెంకటరామన్, సీనియర్ చిన్న పిల్లల వైద్య నిపుణుడు



వామపక్షం.. తిరుపతిలో మాత్రం అధికారపక్షం

తిరుపతిలో దొంగ ఓటరు కార్డుల కుంభకోణం అంశంతో రాష్ట్రమంతా గగ్గోలుగా మారింది. ఐఏఎస్ అధికారి లాగిన్ నుంచే 34 వేల ఓటరు కార్డులు దొంగతనంగా డౌన్‌లోడ్‌చేసి నకిలీ కార్డులు సృష్టించిన వ్యవహారంలో ఐఏఎస్‌లు సస్పెండ్ అయ్యారు.ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. అధికారులు, ఉద్యోగుల మీద వేటు తర్వాత వేటు పడుతున్నాయి. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ,జనసేన పార్టీలు దొంగ ఓట్ల సూత్రధారులను పట్టుకుని చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన ప్రకటిస్తున్నాయి. ప్రజాస్వామిక వ్యవస్థకు అత్యంత ప్రమాదకరమైన నేరం తిరుపతి కేంద్రంగా జరిగితే విచిత్రంగా వామపక్ష పార్టీలు మాత్రం పెదవి విప్పడం లేదు. అన్నింటిమీదా పిడికిలెత్తి, డప్పుకొట్టి గొంతువిప్పే సీపీఐ, సీపీఎం నాయకుల్లో ఒక్కరి గొంతుకూడా ఎందుకు పెగలడం లేదబ్బా అనే సందేహం నగరంలో చర్చగా మారింది. అట్లా అని ఈ రెండు పార్టీలూ అధికార వైసీపీకి మిత్రపక్షాలు కూడా కాదు. జగన్ తీరుపై భగ్గుమనే ఈ పార్టీలు తిరుపతి నగరంలో మాత్రం భిన్నవైఖరి ఎందుకు తీసుకున్నాయన్నదే ప్రజలను విస్తుపరుస్తున్న అంశం. ఆశా వర్కర్ల ఆందోళనలు, అంగన్‌వాడీ వర్కర్ల సమ్మె, పారిశుధ్య కార్మికుల నిరసనలు,సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల సమ్మె.. ఇలా అన్నింటా తామై కనిపించిన తిరుపతి వామపక్ష నేతలు.. ఇక్కడి వైసీపీ నాయకులకు సన్మానాలు చేయడం, వారిని పొగడ్తల్లో ముంచెత్తడం, కొన్నిసార్లు వారితో పొగిడించుకోవడం.. వంటి పరిణామాలను జనం ఒక కంట గుర్తిస్తూనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



బాధ్యతలు స్వీకరిస్తున్న మలిక గర్గ్

సజావుగా ఎన్నికల నిర్వహణ

● ప్రథమ ప్రాధాన్యమన్న ఎస్పీ మలికగర్గ్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 12: రాబోయే ఎన్నికలను ఎటువంటి సమస్యలూ రాకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేటట్టు చూడడమే తన మొదటి ప్రాధాన్యత అని నూతన ఎస్పీ మలిక గర్గ్ అన్నారు.గతంలో ఇక్కడ జరిగిన ఘటనలు, వాటి పర్యవసానాలను ప్రస్తుతం చూస్తున్నామని, మళ్లీ అటువంటి పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సాయంత్రం బాధ్యతలు చేపట్టిన ఆమెకు పోలీసు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు కూడా ప్రాధాన్యతనిస్తానని చెప్పారు.ఎన్నికల సందర్భంగా చాలా కష్టపడి పనిచేయాల్సి ఉందన్నారు.ఓ టీమ్‌గా ఎలా పనిచేయాలి, ఎలాంటి సమస్యలు ఎదురౌతాయి, వాటిని అధిగమించేందుకు ఏంచేయాలనే ప్రణాళికతో ముందుకు సాగుతామన్నారు. ఢిల్లీకి చెందిన మలిక గర్గ్ 2015 ఐపీఎస్ బ్యాచ్ అధికారిణి. పశ్చిమబెంగాల్ క్యాడర్‌కు చెందిన మలిక గర్గ్ శిక్షణ తరువాత పశ్చిమ బెంగాల్ చందన్ నగర్‌లో ఏసీపీగా, సీరాంపూర్ ఏసీపీగా, రాపిడ్ యాక్షన్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్‌గా పనిచేశారు. అనంతరం ఇంటర్ ట్రాన్సుర్‌లో ఏపీ క్యాడర్‌కు వచ్చారు. తొలుత కృష్ణా జిల్లా ఏఎస్పీగా పనిచేసి, తరువాత ప్రకాశం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2 సంవత్సరాల 7 నెలలపాటు అక్కడ ఎస్పీగా పనిచేసిన ఆమె ఇటీవలి బదిలీల్లో భాగంగా తిరుపతిలో బాధ్యతలు చేపట్టారు.





వ్యాబ్ నుంచి ప్రయోగ వేదికకు రాకెట్ తరలింపు

ప్రయోగ వేదికపైకి జీఎస్ఎల్వీ-ఎఫ్ 14

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: ఇస్రో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగానికి సంబంధించి అనుసంధాన పనులు పూర్తయ్యాయి. 2,275 కిలోల బరువు గల కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రయోగించేందుకు షార్ శాస్త్రవేత్తలు సర్వం సిద్ధం చేశారు. జీఎస్ఎల్వీ- మార్క్2 సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పీఎస్ఎల్వీ రాకెట్‌ను నాలుగు దశల్లో ప్రయోగిస్తే జీఎస్ఎల్వీని మూడు దశల్లోనే ప్రయోగిస్తారు. వాతావరణ పరిస్థితుల అధ్యయనం కోసం ఇస్రో ఈ ప్రయోగం చేపట్టిన విషయం తెలిసిందే. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలో వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో (వ్యాబ్) రాకెట్ మూడు దశల అనుసంధాన పనులతో పాటు రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహాన్ని అమర్చే ప్రక్రియను పూర్తి చేసి రెండో ప్రయోగ వేదికకు రాకెట్‌ను తరలించారు. ప్రయోగ వేదిక ఉన్న జీఎస్ఎల్వీ రాకెట్‌కు లెవల్-1, లెవల్-2 తనిఖీలను చేపడుతున్నారు. తుది పరీక్షల అనంతరం లాంచ్ రిహార్సల్, ప్రీ కౌంట్‌డౌన్ నిర్వహించారు. అన్నీ సజావుగా సాగితే ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి నింగిలోకి ఎగరనుంది.



సిలిండర్ పేలి రేగిన మంటలు

సీఆర్ఎస్‌లో సిలిండర్ పేలుడు

రేణిగుంట, ఫిబ్రవరి12: రేణిగుంట సమీపంలోని రైల్వే క్యారేజ్ రిపేరుషాపు(సీఆర్ఎస్)లో శనివారం రాత్రి 8.30గంటలకు ఓ గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. సీఆర్ఎస్‌లో సాధారణంగా శనివారం మధ్యాహ్నం నుంచి కార్మికులకు సెలవు.తిరిగి సోమవారం ఉదయం మాత్రమే పనులు ప్రారంభమవుతాయి.అయితే రైలుపెట్టెల మరమ్మతులు ఎక్కువ చేశామని గుర్తింపు తెచ్చుకోవడానికి అధికారులు రాత్రివరకు కాంట్రాక్టు కార్మికుల చేత పనులు చేయించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.అదృష్టవశాత్తూ కోచ్ బాడీ రిపేరు (సీబీఆర్ షాపు)లో సిలిండర్ పేలినప్పుడు లోపల ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదని తెలిసింది. విధుల్లో భాగంగా సోమవారం లోనికి వెళ్ళిన కార్మికులు సిలిండర్ పేలిందని గుర్తించి భయభ్రాంతులకు గురయ్యారు.గతంలో సిలిండర్ పేలి ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.ఈ సంఘటనపై సీఆర్ఎస్ చీఫ్ వర్క్‌షాపు మేనేజరు దేవసహాయాన్ని వివరణ కోరగా ప్రమాదం ఎలా జరిగిందన్న విషయమై దర్యాప్తు జరుగుతోందని చెప్పారు.



పేలుడుతో దూరంగాపడివున్న సిలిండర్ భాగాలు



ముక్కంటి సేవలో ఇటలీవాసులు

శ్రీకాళహస్తి ఫిబ్రవరి 12:శ్రీకాళహస్తీశ్వరుడిని సోమవారం పలువురు ఇటలీ భక్తులు దర్శించుకున్నారు. విదేశీ భక్తులు భారతీయ సాంప్రదాయ వస్త్రధారణతో ఆలయానికి చేరుకోగా అధికారులు దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు ఆశీర్వదించారు.ఆలయ శిల్ప సౌందర్యాన్ని వీక్షిస్తూ మంత్రముగ్ధులైన ఇటలీవాసులు ఊంజల సేవా మండపం వద్ద ఆశీనులై భక్తి తన్మయత్వంతో శివనామస్మరణ చేశారు. స్థానికులు విదేశీ భక్తులతో సెల్ఫీలు దిగేందుకు ఆసక్తి చూపారు.

సత్యవేడులో ట్రిపుల్ ఐటీకి 46 ఎకరాల భూమి

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలంలో ట్రిపుల్ ఐటీ విద్యా సంస్థకు రాష్ట్రప్రభుత్వం 42.23 ఎకరాల భూమి కేటాయించింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రభుత్వం తాజాగా భూ కేటాయింపు జరుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. సత్యవేడు మండలం మల్లావారిపాలెం రెవిన్యూ గ్రామం 382, 389, 392, 393, 394, 395 సర్వే నంబర్లలోని 42.23 ఎకరాలను ఎకరా రూ. 11.75 లక్షలు చొప్పున ధరతో కేటాయించింది. ఈ భూములను 2008లో అప్పటి ప్రభుత్వం పరిశ్రమల కోసం ఏపీఐఐసీకి కేటాయించింది.ఆ భూములను వెనక్కు తీసుకుని ట్రిపుల్ ఐటీ కోసం కేటాయించాలని, అందుకోసం ఎకరాకు రూ. 4.70 లక్షల ధరతో తిరుపతి కలెక్టర్ గత నెల 19న ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అయితే ధరను రెండున్నర రెట్లు పెంచి భూములను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖకు కేటాయిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రైవేటు వెంచర్ కోసం చెరువులో బాట!

● శ్రీకాళహస్తిలో రియల్టర్ల ఆగడాలు
● అధికార పార్టీ నాయకుడి అండతో బరితెగింపు



చెరువులో దారి ఏర్పాటుకోసం తెప్పించిన సిమెంట్ పైపులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి పట్టణ శివారు లోని బసవయ్యపాలెం వద్ద లింక్ బైపాస్ రోడ్డుకు అనుకొని ఉన్న చెరువుపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు కన్నేశారు. చెరువు భూమికి అనుకుని వేసిన వెంచర్‌కు దారికోసం ఏకంగా పైపులు వేసి చెరువునే చదును చేసే పనులకు శ్రీకారం చుట్టారు. ఆరు నెలల క్రితం లింక్ బైపాస్ రోడ్డు నుంచి మొదట చిన్న రోడ్డు ఏర్పాటు చేసి తర్వాత సుమారు రూ.20 కోట్ల చెరువు భూమి స్వాహా చేసేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు సాగించారు.ఈ విషయంపై శ్రీకాళహస్తిలో భూరాబందులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో పనులాపేశారు. మళ్లీ డిసెంబర్ 25వ తేదీన బసవయ్యపాలెం చెరువులోకి బాట వేసేందుకు రాత్రికి రాత్రి చదును చేశారు.ఈ విషయాన్నీ ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో మరికొంతకాలం చెరువు కబ్జాకు అడ్డుకట్ట పడింది.ఇటీవల కొయ్యల అమ్మకాలు చేసే కొందరు చెరువు భూమికి ఆనుకుని ల్యాండ్ కన్వర్షన్, అప్రూవల్ తీసుకోకుండానే ప్లాట్లు వేశారు.కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ఒకరి భూమి గుండా రోడ్డు చూపుతూ ప్లాట్లు అమ్మేశారు.దీంతో ఆ భూమి యజమాని తన స్థలానికి కంచె వేసుకోవడంతో ప్లాట్లకు దారి లేకుండాపోయింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అమ్మకందారులను నిలదీయం మొదలు పెట్టారు.ఈ పరిస్థితుల్లో రియల్టర్లు బసవయ్యపాలెం పంచాయతీలోని ఓ కీలక వైసీపీ నేతతో చేతులు కలిపారు. చెరువు భూమిలో పైపులు వేసి బైపాస్ నుంచి ప్లాట్లకు రోడ్డు వేసేందుకు పథకం రచించారు. అధికారుల చేతులు తడపడంతో ఇక అడిగే వారుండరన్న ధీమాతో సిమెంట్ పైపులను దించి రాత్రివేళ చెరువు భూమిలో బాట వేసేందుకు సన్నద్ధమయ్యారు.సోమవారం సాయంత్రం చెరువును పూడ్చేందుకు పొక్లయినరును కూడా తరలించారు. అర్ధరాత్రి సిమెంట్ పైపులపై టిప్పర్లతో మట్టి తోలేందుకు సిద్ధమయ్యారు. బైపాస్ నుంచి ఇదే రోడ్డు ఏర్పాటయితే మొత్తం చెరువుకు చేటు తప్పదు. అందుకే గత పాలకులు చెరువులోకి బాటలు వేయకుండా రక్షించారు.అయితే ఇప్పటి పాలకులు రియల్టర్లతో చేతులు కలిపి చెరువు భూమిని ఆరగించేందుకు సిద్ధమయ్యారు.



చెరువును పూడ్చేందుకు తెప్పించిన పొక్లయినరు.మట్టి తోలేందుకు పరిచిన పైపులు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం


రామనాథరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న పులివర్తి సుధా రెడ్డి

భాకరాపేట, ఫిబ్రవరి12: రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిందేనని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి అన్నారు. సోమవారం చిన్నగొట్టిగల్లు మండలంలోని దీన్‌దార్లపల్లె, కమ్మపల్లె, తెట్టుపల్లె, కుమ్మరపల్లె గ్రామాల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు.తెట్టుపల్లెకు చెందిన రామనాథరెడ్డికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.మండల పార్టీ అధ్యక్షుడు మురళి, కార్యదర్శి మదన మోహన, చిట్టెమ్మ, కుమారస్వామిరెడ్డి, ఆర్వీ రమణారెడ్డి, మౌలాలి, చలపతి, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

చిత్ర లేఖనంలో స్నేహశ్రీకి బహుమతి



ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 12: జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో 'ఆడ పిల్లల సంరక్షణ ఇతివృత్తం' అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ఎర్రావారిపాలెం ఆదర్శ పాఠశాలలో 8 వతరగతి చదువుతున్న ఎం.స్నేహశ్రీ బహుమతి పొందింది. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో చిత్రలేఖన పోటీలు తిరుపతిలో జరిగాయి. మండలం నుంచి పోటీలకు హాజరైన స్నేహశ్రీ గీసిన చిత్రానికి జిల్లా స్థాయిలో తృతీయ బహుమతి కింద రూ.2000 నగదు, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ అందించారు. స్నేహను ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

హౌసింగ్ అధికారులపై సభ్యుల ఆగ్రహం


మాట్లాడుతున్న ఎంపీపీ రెడ్డెమ్మ

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 12 : మండల పరిషత్ సమావేశంలో హౌసింగ్ అధికారుల తీరుపై సభ్యులు మండిపడ్డారు. ఎర్రావారిపాలెం మండల సమావేశం సోమవారం వెలుగు కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎంపీపీ రెడ్డెమ్మ అధ్యక్షతన జరిగింది. జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయినా బిల్లుల చెల్లింపులో హౌసింగ్ ఏఈ కాంతారావు తీవ్ర జాప్యం చేస్తున్నరని రెడ్డెమ్మ ఆగ్రహం వ్యక్తం చేశారు.సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా లబ్ధిదారులకు అందించే బాధ్యత అధికారులదేనని సర్పంచ్ మధుసూదన రెడ్డి అన్నారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి రాకుండా సర్పంచ్‌లు గ్రామాల్లో ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని తీర్మానించారు.జడ్పీటీసీ కరుణాకర రెడ్డి, ఎంపీడీవో మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



రామచంద్రాపురం, ఫిబ్రవరి 12: మండలంలోని కుప్పంబాదూరు, రాయలచెరువుపేట, మిట్టకండ్రిగ, సీకేపల్లి, నెత్తకుప్పం, అనుపల్లి పంచాయతీలోని 19 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యాసామగ్రి పంపిణీ చేశారు.ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జడ్పీటీసీ ఢిల్లీరాణి భానుకుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, వైసీపీ జిల్లా నాయకులు దామోదరరెడ్డి, రఘునాథరెడ్డి, ఎంపీటీసీ కృష్ణవేణి, పాఠశాల ఛైర్మన్ సురేష్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సృజనకుమారి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, సీసీ రోడ్ల ప్రారంభం

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 12: రూ. 40 లక్షలతో నిర్మించిన వెంకటపతి నగర్ సచివాలయం, రూ. 33 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, రూ. 16 లక్షలతో ఏర్పాటు చేసిన బోర్లను తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.సర్పంచ్ చిన్నియాదవ్, జడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీపీ యశోద, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, ఎంపీటీసీ నారాయణమ్మ పాల్గొన్నారు.

ఆటోనగర్‌లోనే వెల్డింగ్ షాపులకు స్థలాలివ్వాలి : టీఎన్‌టీయూసీ



తిరుపతి(ఆటోనగర్), ఫిబ్రవరి 12: ఆటోనగర్‌లోనే వెల్డింగ్ షాపులకు స్థలాలివ్వాలని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అంబూరి సింధూజ డిమాండ్ చేశారు. సోమవారం శ్రీవేంకటేశ్వర ఫ్యాబ్రికేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోనగర్‌లో నిరసన తెలిపారు. తిరుపతిలో వెల్డింగ్ షాపులు నిర్వహిస్తున్న యజమానులకు 26 ఏళ్ల క్రితం ఆటోనగర్‌లోని సర్వే నెంబర్లు 74/7, 95/2లలో మూడున్నర ఎకరాలను కేటాయించారని చెప్పారు. ఇందుకోసం కొందరు యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాలను చెల్లించారన్నారు. అయితే తుడా అధికారులు ఇప్పటి వరకు స్థలాలు చూపలేదన్నారు. మరోవైపు ఈ స్థలంలో గతంలో నిర్మాణాలు చేపట్టగా కోర్టు స్టే విధించందని గుర్తుచేశారు. కోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా ఇపుడు నిర్మాణాలు చేపట్టడం నేరమన్నారు. రెడ్డెప్పనాయుడు, మహేష్, కె.కుమార్, శ్రీహరిరెడ్డి, జయరాం, గోపాల్, మల్లికార్జునరావు, సుధాకర్‌నాయుడు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు విగ్రహం


తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారులు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 12: ఏడాది గడిచినా.. వెళ్లిపోయిన అమ్మ తలపులు ఆ బిడ్డలను వదలడం లేదు. పేదరాలైన ఆ తల్లి పడ్డ కష్టం.. తమను పెంచి పెద్దచేసిన తీరు.. తమ ఉన్నతి కోసం ఆమె తాపత్రయం.. ఇవన్నీ రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ఆ తల్లి కోసం తల్లడిల్లిన బిడ్డలు ఆమె జ్ఞాపకాలకు పదిలపరచుకోవాలనుకున్నారు. గత యేడాది జనవరి 24న నెల్లూరు జిల్లా కావాలి వద్ద జరిగిన కారు ప్రమాదంలో తమకు దూరమైపోయిన అమ్మను విగ్రహంగా మార్చుకుని తమ ఇంటి ఆవరణలో ప్రతిష్టించుకున్నారు. దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామంలో సోమవారాం సంచి రమణమ్మ(61) విగ్రహ ప్రతిష్ట జరిగింది. విజయ్‌కుమార్, శ్యామ్, వినయ్‌కుమార్‌లకు అమ్మమీద ఉన్న ప్రేమానురాగాలను చూసి ఊరు అబ్బురపడింది. ఆతల్లి కష్టంతో పెరిగిన వీరిలో ఒకరు వ్యాపారి కాగా, మరో ఇద్దరు సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా విదేశాల్లో స్థిరపడ్డారు. సంచి రమణమ్మ తెలుగుదేశం పార్టీ మండల మహిళా నాయకురాలిగా చురుకైన ప్రాత పోషించారు. సోమవారం టీటీడీ బోర్డు సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి రమణమ్మకి నివాళి అర్పించారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి


ఏకాంబరం (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, ఫిబ్రవరి12: చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు ... తిరుపతిలోని గిరిపురానికి చెందిన ఏకాంబరం తన సొంతూరైన పూతలపట్టు మండలం, కిచ్చన్నగారిపల్లెకు వెళ్ళి ఆదివారం రాత్రి తిరిగి తిరుపతికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏకాబరం అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బేసిక్‌లైఫ్ సపోర్టుపై వర్క్‌షాప్


సమావేశంలో మాట్లాడుతున్న శివరామకృష్ణారెడ్డి

చంద్రగిరి,ఫిబ్రవరి12: ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో సోమవారం పారామెడికల్ విద్యార్థులకు బేసిక్‌లైఫ్ సపోర్టుపై వర్క్‌షాపు నిర్వహించారు. ముఖ్య అతిథిగా అమరాన్ ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగ అధిపతి డాక్టర్ శివరామకృష్ణారెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మనిషికి అనుకోకుండా శ్వాసఇబ్బంది, కళ్ళు తిరగడం, బ్లడ్ ప్రెషర్ పెరగడం, లేదా తగ్గడం వలన గుండె సమస్య ఏర్పడినపుడు మనిషిని ఎలా కాపాడాలో తెలియజేశారు. కార్యక్రమంలో పారామెడికల్ విభాగాధిపతి డాక్టర్ మానస్ చక్రవర్తి, ఎంబీయూ రిజిస్ట్రార్ డాక్టర్ సారధి , ఫిజియోథెరపి విభాగాధిపతి డాక్టర్ చంద్రకళాధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తొండవాడలో ఎన్ఎస్ఎస్ క్యాంప్


సమావేశంలో మాట్లాడుతున్న రోజమ్మ

చంద్రగిరి, ఫిబ్రవరి 12: తొండవాడ పంచాయతీలో సోమవారం నుంచి శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు క్యాంప్ ప్రారంభమైంది. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ రోజమ్మ మాట్లాడుతూ ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, ఇంటి వ్యర్థ పదార్థాలను సరైన పద్ధతిలో తొలగించే విధానాలు, సెల్‌ఫోన్ దుర్వినియోగంతో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

'స్పందన' అర్జీలపై నిర్లక్ష్యం వీడండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల విషయంలో నిర్లక్ష్యం వీడాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 241 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూశాఖకే అత్యధికంగా 184 ఉన్నాయి. కలెక్టర్‌తోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు వినతులు స్వీకరించారు.



ఆన్‌లైన్‌లో నా పేరు తొలగించారు



సర్వే నెంబరు 83/4లో మూడెకరాల మెట్టభూమి, 83/3లో 2.57ఎకరాలు వారసత్వంగా వచ్చింది. నా పేరుపై 28 ఏళ్ల క్రితమే పట్టాదారు పుస్తకం ఉంది. దీన్ని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో పెట్టి, రుణం కూడా తీసుకున్నాను. ఇపుడీ భూమికి ఆన్‌లైన్‌లో నా పేరు తొలగించి, సాయినాయుడు పేరును తహసీల్దారు పద్మావతి నమోదు చేశారు. దీనిపై విచారించి న్యాయం చేయండి.

- చంద్రయ్య, కోట మండలం

కానిస్టేబుల్ మా భూమిని ఆక్రమించాడు

మా స్థలాన్ని దయాకర్ అనే కానిస్టేబుల్ ఆక్రమించి, మమ్మల్ని బెదిరిస్తున్నాడు. టైలరింగ్ వృత్తిదారులకు 1997లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబరులో 386/2లో ప్లాట్లు కేటాయించింది. మాకూ అలాగే ఓ ప్లాటు వచ్చింది. తర్వాత నా భర్త గుండెపోటుతో మరణించడంతో ఆ స్థలంలో ఇల్లు కట్టలేక పోయాం. పాచిపని చేసుకునే నాకు న్యాయం చేయండి.

- తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉషతో కలిసి కలెక్టర్‌కి మొరపెట్టుకున్న శ్రీకాళహస్తికి చెందిన సెల్వి.

మేమూ ఈ దేశంలోనే ఉన్నాం

మేమూ ఈ దేశంలోనే ఉన్నాం. మమ్మల్ని పట్టించుకోండి. 12 ఏళ్లగా ఇక్కడే నివాసం ఉంటున్నాం. ఐదేళ్లగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలువలు లేక ఇళ్ల మధ్యలో మురుగు చేరి దోమలు పెరిగి అంటువ్యాధులు వస్తున్నాయి.

- కలెక్టరేట్ ఎదుట పిల్లపాపలతో కలిసి ఆందోళన చేసిన గరుడాద్రి, వెంకటాద్రి, రాజీవ్ గృహాల్లో నివసిస్తున్నవారు



హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు కావాలి

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. దీనివల్ల 45 ఏళ్ల దాటిన వారికి రూ.6వేల పింఛను, ప్రమాద బీమా, చదువుకునే వారికి, పిల్లల పెళ్లిళ్లకు, గర్భిణులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందుతుంది.

- కలెక్టరేట్ వద్ద హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ.



యాత్ర సినిమా దర్శకనిర్మాతకు రూ. 20 కోట్ల భూమి అప్పగింతపై పోరాటం

● గాంధీపురం పర్యటనలో నాని


కార్యక్రమంలో పాల్గొన్న పులివర్తి నాని, ఈశ్వర్ రెడ్డి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 12:హార్సిలీహిల్స్‌లో రూ. 20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని యాత్ర-2 సినిమా దర్శకనిర్మాత మహీ రాఘవకు ధారాదత్తం చేయడం దారుణమని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అభిప్రాయపడ్డారు. గాంధీపురంలో సోమవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూకేటాయింపు నిర్ణయాన్ని సీఎం జగన్ వెంటనే ఉపసంహరించుకోవాలని ,లేనిపక్షంలో ప్రజలతో కలిసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పదవుల పాకులాటలో నియోజకవర్గాన్ని, సమస్యలను గాలికి వదిలేశారని మండిపడ్డారు.తిరుపతి ఉప ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించిన అధికారులు ఒక్కొక్కరుగా సస్పెండ్ అవుతుండడం చూశాకైనా చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మఠం స్థలంలోని పాకల తొలగింపు



తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): హథీరాంజీ మఠానికి చెందిన స్థలంలో వేసిన తాత్కాలిక పాకలను పోలీసుల సహాయంతో మఠం సిబ్బంది తొలగించారు. శ్రీనివాస కల్యాణ మండపాల ఎదురుగా ఉన్న మఠం స్థలంలో చేపల విక్రయదారులు పాకలను వేసుకుని, వ్యాపారం సాగిస్తున్నారు. ఇది మఠం అధికారుల దృష్టికి వచ్చింది. దాంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసుల సహకారంతో మఠం ఏఈవో శ్రీనివాసులు రెడ్డి తన సిబ్బందితో కలిసి స్థలం వద్దకు వెళ్లారు. అక్కడున్న దాదాపు 20 పాకలను పొక్లెయిన్‌తో తొలగింపు చేపట్టారు. సమాచారం అందుకున్న సీపీఐ నాయకులు ఘటనాస్థలంకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అప్పటికే దాదాపు అన్నింటినీ తొలగించేయడంతో మఠం సిబ్బందితో కాసేపు వాగ్వాదం చేసి వెళ్లిపోయారు. మఠం స్థలంలో శాశ్వత నిర్మాణాలున్నా తొలగిస్తామని ఏఈవో ఈసందర్భంగా మీడియాతో చెప్పారు. కాగా.. గతంలో కల్యాణమండపం పక్కన బైరాగిపట్టెడకు వెళ్లే రోడ్డువైపు చేపలు విక్రయిస్తుంటే.. ఖాళీగా ఉండే మఠం స్థలంలో అమ్ముకోమని మున్సిపల్ అధికారులు చెప్పారని, ఇప్పుడిలా చేస్తే తమ పరిస్థితి ఏమిటని వ్యాపారస్తులు వాపోయారు. తమకు తగిన స్థలం చూపించాలని కోరారు. మఠం సిబ్బంది సీతారామయ్య, విజయ నాయక్, మునివెంకటేష్, కిరణ్, మధు, ఈస్టు పోలీస్ స్టేషన్ ఎస్ పురుషోత్తం పాల్గొన్నారు.


శ్రీవారి ఆలయం ముందు ముగ్గులు వేస్తున్న సిబ్బంది


గ్యాలరీల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు


శ్రీవారి ఆలయం ముందు ఏర్పాటు చేసిన జర్మన్‌షెడ్లు

జోరుగా రథసప్తమి ఏర్పాట్లు

తిరుమల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి):రథసప్తమి వేడుకలకు తిరుమల సిద్ధమవుతోంది.ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయ మాడవీధుల్లో జరిగే వాహన సేవలకు హాజరయే భక్తుల కోసం టీటీడీ పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తోంది. శ్రీవారి వాహన సేవలు ప్రారంభమయ్యే వాహన మండపాన్ని ఇప్పటికే వివిధ రంగులతో ముగ్గులు వేసి సౌందర్యవంతంగా తీర్చిదిద్దారు. శ్రీవారి ఆలయం ముందు, నాలుగు మాడవీధుల్లో పెయింట్‌తో ముగ్గులు వేస్తున్నారు.భక్తులు ఉదయం నుంచి రాత్రి వరకు మాడవీధుల్లోని గ్యాలరీల్లోనే వేచివుండే క్రమంలో ఎండకు, వానకు, చలికి ఇబ్బంది లేకుండా టీటీడీ తాత్కాలిక షెడ్లను ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి కుళాయిలను కూడా సిద్ధం చేసింది. ఎండకు భక్తుల కాళ్లు కాలకుండా నేలపై కూల్‌పెయింట్ వేస్తున్నారు. మరోవైపు విద్యుత్ అలంకరణ ఏర్పాట్లు కూడా చివరిదశకు చేరుకున్నాయి. వీటి పనితీరును మంగళ, బుధవారాల్లో పరిశీలించి లోటుపాట్లను సరిచేయనున్నారు.

వాహనసేవల వివరాలు

- తెల్లవారుజాము 5.30 నుంచి 8గంటల మధ్య: సూర్యప్రభవాహనం(6.40 గంటలకు సూర్యోదయం)
- 9-10: చిన్నశేషవాహనం
- 11-12: గరుడవాహనం
- 1-2: హనుమంతవాహనం
- 2-3: చక్రస్నానం
- 4-5: కల్పవృక్షవాహనం
- 6-7: సర్వభూపాలవాహనం
- 8-9: చంద్రప్రభవాహనం

టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలి

తిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆలయాల వద్ద పచ్చదనాన్ని పెంపొందించాలని అధికారులను జేఈవో వీరబ్రహ్మం ఆదేశించారు. తిరుపతి టీటీడీ పరిపాలన భవనం నుంచి సోమవారం ఆయన వర్చువల్ సమావేశం నిర్వహించారు. టీటీడీ ఆలయాలతోపాటు అలిపిరి వద్ద పచ్చదనాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలన్నారు. టీటీడీ ఖాళీ స్థలాల్లో మున్సిపల్ అధికారులను సమన్వయం చేసుకుని మొక్కల పెంపకం చేపట్టాలని సూచించారు. శేషాచల అడవుల్లో అకేషియా చెట్ల స్థానంలో ఔషధ మొక్కలు పెంచాలన్నారు. 2025 టీటీడీ క్యాలెండర్లను స్థానిక ఆలయాల చిత్రాలతో మరింత ఆకర్షణీయంగా రూపొందించాలని చెప్పారు. డిప్యూటీఈవో గోవిందరాజన్, డడీఎఫ్‌వో శ్రీనివాస్, రవాణా విభాగం జీఎం శేషారెడ్డి, డీఈవో భాస్కర్‌రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శ్యామలాదేవి నవరాత్రివేడుకలు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 12: రాయలచెరువు కట్ట శ్రీశక్తి పీఠంలో సోమవారం శ్యామలాదేవి నవరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 9గంటలకు వేదపండితులు కాళీ హోమం ప్రారంభించగా కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానందభారతి స్వామి శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామి మధ్యాహ్నం 12గంటలకుపూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ భారతి అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు పీఎం 'విశ్వకర్మ'పై అవగాహన సదస్సు

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 10గంటలకు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. వివరాలకు 95155 73489 ఫోన్ నెంబరును సంప్రదించాలని ఎస్ఎల్ఎన్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ తెలిపారు.

మజ్జిగ కాలువ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థ 'స్పందన'లో అధికార పార్టీకి చెందిన ప్రతినిధులే ఫిర్యాదులు చేస్తూ వార్తల్లో కెక్కుతుంటారు. ఈక్రమంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలోనూ డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ కార్పొరేషన్ పరిధిలోని ఆక్రమణకు గురైన మజ్జిగ కాలువ స్థలాన్ని, అనుమతులు లేకుండా అందులో నిర్మిస్తున్న కట్టడాలపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని స్పందనలో ఎస్ఈ మోహన్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి తన డివిజన్‌లోని సచివాలయానికి, షాపింగ్ కాంప్లెక్స్‌కు లిఫ్ట్ పెట్టాలని, 50వ డివిజన్ కార్పొరేటర్ అనిల్ తమ డివిజన్లో తవ్వేసిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేయాలని విన్నవించారు.

కార్పొరేషన్ ఏడీసీగా చరణ్‌తేజ్ రెడ్డి

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్ (ఏడీసీ)గా చరణ్‌తేజ్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల బదిలీల్లో భాగంగా స్టేట్ ఆడిట్ విభాగంలో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఈయన్ను ఏడాదిపాటు డిప్యుటేషన్‌పై ఏడీసీగా ప్రభుత్వం నియమించింది. పది రోజుల తర్వాత ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీషను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎస్వీయూ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల అధికారిగా లోకనాథం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12: ఎస్వీయూ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల అధికారిగా పరీక్షల విభాగం ఏఏవో లోకనాథం నియమితులయ్యారు. ఇటీవల ఈ సొసైటీ పదవీకాలం పూర్తయ్యింది. దీంతో ఈ నెల 28న ఎన్నికలు నిర్వహించనున్నారు. 581 మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉంది. 19న నామినేషన్ల స్వీకరణ, 20న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ, అదే రోజు తుది జాబితా విడుదల చేస్తారు.

శెట్టిపల్లె భూముల్లో పనులు ప్రారంభించాలి

మున్సిపల్ కార్యాలయం వద్ద బాధితుల నిరసన


మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న శెట్టిపల్లి భూబాధితులు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 12: శెట్టిపల్లె భూముల్లో వెంటనే పనులు ప్రారంభించి ప్లాట్ల కొనుగోలుదారులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు డిమాండ్ చేశారు. ప్రొసీడింగ్స్ ఇచ్చినా పనులు మొదలు కాకపోవడంతో సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద శెట్టిపల్లె భూబాధితులతో కలిసి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. వెంటనే లేఅవుట్ పనులను ప్రారంభించి, ప్లాట్లను కేటాయించాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం ఎస్ఈ మోహన్‌కు వినతిపత్రం అందించారు. సీపీఎం నగర కార్యదర్శి సుబ్రహ్మణ్యం, శెట్టిపల్లె ఇళ్ల స్థలాల పరిరక్షణ కమిటీ నాయకులు రాధాకృష్ణ, శ్రీనివాసులు, సురేష్, జయచంద్ర, బాధితులు పాల్గొన్నారు.

మా భూములను కాపాడండి

బాధితుడి విజ్ఞప్తి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12:'కమ్యూనిస్టు పార్టీల పేరు చెప్పి.. కొంతమంది మా భూములను కబ్జా చేశారు. వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలి' అని బాధితుడు సిద్ధుల రవి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రేణిగుంట మండలం కరకంబాడి గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు. 153/1లో 44 ఎకరాల 95సెంట్ల భూమి పూర్వీకుల నుంచి తరతరాలుగా తమ కుటుంబీకుల ఆధీనంలో ఉందన్నారు. పైగా ఈ భూమిపై ప్రభుత్వానికి, తనకు కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని చెప్పారు. ఇదివరకే కింది కోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో హైకోర్టుకు ప్రభుత్వం అపీల్ చేయడంతో ఇంజక్షన్ ఆర్డరు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయితే కొంతమంది కమ్యూనిస్టు పార్టీల పేరు చెప్పి. తమ భూముల్లో ఇతర జిల్లాలకు చెందిన వారు గుడారాలు వేసుకుని తిష్ట వేశారని వాపోయారు.

ఎల్లమ్మ ఆలయంలో బాలాలయం



చంద్రగిరి, ఫిబ్రవరి 12: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పరివార దేవతామూర్తుల బాలాలయం పూజా కార్యక్రమాలు సోమవారం నిర్వహించారు. పండితులు ఇటుకల శివరామయ్యశర్మ ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యము, నవగ్రహ అష్టదిక్పాలక, పంచపాలక, ప్రధాన దేవతా ఆవాహనం, గణపతి, సుబ్రమణ్య, నవగ్రహ కలాన్యాస జీర్ణోద్ధరణ ప్రాయశ్చిత శాంతి హోమాలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో తిమ్మారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

తిరుపతి



పల్లెవెలుగు బస్టాండులో..

భక్తిక్షేత్రంలో బస్టాండునైనా వదలండయ్యా!

అధికారంలో ఉన్నాం కదా అని వైసీపీ దబాయింపు ప్రచారం తిరుపతి సెంట్రల్ బస్టేషన్‌నూ వదలడం లేదు. నగరాన్ని రాజకీయ ఫ్లెక్సీలతో ముంచెత్తిన అధికార పార్టీ బస్టేషన్‌లోనూ కాస్త జాగా కనిపించిన చోటల్లా జగన్ బొమ్మలతో నింపేసింది. లక్షల జనం భక్తితో వచ్చిపోయే చోట ఈ రాజకీయ గోల ఏమిటంటూ ప్రయాణికులు విసుక్కుంటూ ఉంటే, ఇదో సంప్రదాయంగా మారిపోయి ప్రతిసారీ బస్టాండును నాయకుల ఫ్లెక్సీలతో నింపేసే ప్రమాదం ఉందని ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

- తిరుపతి(కొర్లగుంట)



బస్సుస్టేషన్ లోపలి గేటు వద్ద..

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 72,256 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,021 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో 24న కుమారధార తీర్థ ముక్కోటి

తిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 24వ తేదీన కుమారధార తీర్థ ముక్కోటి జరగనుంది. ప్రకృతి సౌందర్యాల నడుమ కుమారధార తీర్థంలో స్నానమాచరించడాన్ని భక్తులు ప్రత్యేకంగా భావిస్తారు.

గరుడవాహనంపై దర్శనమివ్వనున్న శ్రీవారు

ఇదే రోజున తిరుమల శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధుల్లో శ్రీవారు తన ఇష్టవాహనమైన గరుడవాహనంపై కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల మధ్య వాహన సేవ జరగనుంది.




హవ్వ.. స్విమ్స్‌కి.. ఇదేం పని!

స్విమ్స్ ఒక వైద్య సంస్థ. సేవా దృక్పథం తప్ప రాజకీయ ఆలోచనకు తావుండకూడదు. వైసీపీ దబాయింపు రాజకీయాల్లో ఇవన్నీ నడవ్వు. ఆత్మీయ సమావేశాల పరంపరను స్విమ్స్‌కీ విస్తరించారు. ఆత్మీయ ఆతిథ్యాలకు వేదికైన ఎంఆర్ పల్లెలోని ఒక సమావేశ మందిరానికి ఆదివారం స్విమ్స్ సిబ్బందిని తరలించారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని పిలుపునిచ్చారు. స్విమ్స్‌లో పనిచేస్తున్న కొందరు కీలక అధికారులు సిబ్బందిపై ఒత్తిడి తీసుకొచ్చి మరీ ఈ పనికి తెగబడ్డట్టు చెబుతున్నారు. స్విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ (నర్సింగ్) ప్రభావతి, ఫిజియోథెరపీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి, రిటైర్డ్ డీడీ (పీఆర్వో) వెంకటరమణారెడ్డి వంటివారు ఈ ఆత్మీయ సమావేశంలో కనిపించారు. 'యువనేతను గెలిపించుకుందాం' అనే ఫ్లెక్సీ పెట్టి మరీ సమావేశం నిర్వహించారు. కొంతమంది రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని సమావేశానికి తరలించారు. ఎమ్మెల్యే అభ్యర్థితోపాటు అధికారులు కూడా వేదికపై కూర్చోవడం విశేషం. వైసీపీకి ఓటు వేయాలని సిబ్బందికి సూచనలు చేశారు. ఇదే సందని.. పదోన్నతులు, ఇంటి పట్టాలు కావాలంటూ రెగ్యులర్ ఉద్యోగులు కోరగా, టైం స్కేలు కావాలని అవుట్ సోర్సింగ్ సిబ్బంది అడిగారు. గెలిపించిన వెంటనే డిమాండ్లన్నీ నెరవేరుస్తానని అందరికీ చెప్పినట్టే యువనేత ధాటీగా హామీ ఇచ్చేశారు.. ఎన్నికలకు ముందు జగనన్న లాగే. ఆత్మీయ సమ్మేళనం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో హవ్వ.. స్విమ్స్ ఉద్యోగులకు ఇదేం పని!.. అంటూ నెటిజన్లు తలబాదుకుంటున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

దొంగ ఓట్లపై నైతిక బాధ్యతతో సీఎం రాజీనామా చేయాలి

● కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12: తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంలో నైతిక బాధ్యత వహిస్తూ సీఎం జగన్ రాజీనామా చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్ల వ్యవహారం ఎమ్మెల్యేలు, మంత్రుల వల్ల అయ్యేది కాదని.. దీనివెనుక ముఖ్యమంత్రి హస్తముందని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో ప్రెసిడెంట్ రూల్ తీసుకొస్తేనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరుగుతాయన్నారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను దేవుడు పంపిన దూతగా అభివర్ణించారు. తమిళనాడులో జయలలితలాగా ఏపీలో షర్మిల.. ముఖ్యమంత్రి అవుతుందని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

సూత్రధారులైన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించండి: బీజేపీ

తిరుపతి ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల ప్రక్రియలో సూత్రధారులైన వైసీపీ నేతలపై ఐపీసీని ప్రయోగించాలని, నకిలీ ఎన్నికల అధికారిని వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు సామంచి శ్రీనివాస్, భానుప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. ఉప ఎన్నిక సమయంలో దొంగ ఓట్లు వేసిన వారిని పోలీసులకు అప్పజెప్పితే వారిని వదలేసి.. తమను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలికి నేడు సస్పెండ్ కావడం ప్రభుత్వ యంత్రాంగానికి గుణపాఠం అని చెప్పారు. ఎప్పుడో జరిగిన ఎన్నికలకు సాక్ష్యాలు లేవని వైసీపీ నేతలు సంబర పడుతున్నారన్నారు. సాక్ష్యాలన్నీ సజీవంగానే ఉన్నాయని గుర్తుచేశారు. ఈ ప్రక్రియలో కేవలం 10శాతం అధికారులుంటే, 90 శాతం ప్రజాప్రతినిధులు ఉన్నారన్నారు. దొంగ ఓట్ల విషయంలో అసలు దోషులను చట్టం ముందు ఉంచేవరకు తాము పోరాడతామని స్పష్టం చేశారు. నాయకులు వరప్రసాద్, భాస్కర్, అజయ్‌కుమార్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

సస్పెండైన అధికారులు అప్రూవర్లుగా మారండి : నవీన్ సూచన

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 12: సస్పెండైన అధికారులు అప్రూవర్లుగా మారి ఒత్తిడి తీసుకొచ్చిన నాయకులు, ఉన్నతాధికారుల పేర్లను బహిర్గతం చేసి నిజాయితీ నిరూపించుకోవాలని రాయలసీమపోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు.34వేల బోగస్ ఓటరు కార్డుల సూత్రధారుడు ఎవరు, ఎక్కడ తయారు చేశారో నిగ్గు తేల్చాలన్నారు. వీటినితొలగించకుంటే హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. బోగస్ ఓట్లతో గెలిచిన వారిని పదేళ్లపాటు ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయకుండా కేంద్ర ఎన్నికల సంఘం అనర్హత వేటు వేయాలన్నారు.

డబుల్ ఎంట్రీ ఓటును అధికారులు తొలగించకపోతే నా తప్పేముంది?

● కార్పొరేటర్ గణేష్‌కుమార్

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12: డబుల్ ఎంట్రీ ఓటును అధికారులు తొలగించకపోతే అందులో తన తప్పు ఏముందని మూడో డివిజన్ వైసీపీ కార్పొరేటర్ గణేష్ కుమార్ ప్రశ్నించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. గతంలో పాత చిరునామాతో ఉన్న ఓటు తొలగించి.. కొత్త ఇంటి డోర్ నెంబరుపై ఓటును మార్చాలని వలంటీరు, బీఎల్వో దృష్టికి తీసుకెళ్లి మార్చుకున్నానన్నారు. అయితే అధికారులు మాత్రం పాత ఓటును ఇప్పటివరకు తొలగించలేదని.. ఇందులో తన ప్రమేయం ఏముందన్నారు. ఈవిషయంపై కృష్ణయాదవ్ తన తండ్రి ఎవరు అని సంబోధించడంపై మండిపడ్డారు. ఇప్పటికైనా ఆ మాటను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

రేపటినుంచి దక్షిణ భారత సంగీతోత్సవం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 12: మహతి వేదికగా బుధవారం నుంచి ఈనెల 16వ తేదీవరకు దక్షిణభారత సంగీత, నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు టీటీడీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల, నాదస్వర డోలు పాఠశాల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పద్మశ్రీ ఎల్లా వేంకటేశ్వరరావు, పసుమర్తి రామలింగ శాస్త్రి వంటి ప్రఖ్యాత కళాకారులు పాల్గొంటారు. యక్షగానాలు, నృత్యరూపకాలను కళాకారులు, విద్యార్థులు ప్రదర్శిస్తారు.

సంస్కృత వర్సిటీలో చర్చాగోష్ఠి

తిరుపతి(విద్య), ఫిబ్రవరి12:జాతీయసంస్కృతవర్సిటీలో ద్వైతవేదాంత విభాగం ఆధ్వర్యంలో తర్కతాండవంపై చర్చాగోష్ఠి సోమవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వచ్చిన బెంగళూరుకు చెందిన పూర్ణప్రజ్ఞా సంశోధన మందిరం డైరెక్టర్ ప్రొఫెసర్ ఏవీ నాగసంపిగేతో వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కలసి ఈపదిరోజుల చర్చాగోష్ఠిని ప్రారంభించి, ప్రసంగించారు. ద్వైత వేదాంతశాస్త్రంలో తర్కతాండవం సుప్రసిద్ధమైనదని చెప్పారు. దర్శనసంకాయ డీన్ ప్రొఫెసర్ విష్ణుభట్టాచార్యులు మాట్లాడుతూ తర్కతాండవం గ్రంథంలోని విషయాలను అందరూ అధ్యయనం చేయాలని ఆకాంక్షించారు. అకడమిక్‌డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, ద్వైతవేదాంతవిభాగ హెడ్ ప్రొఫెసర్ నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన బాలికలకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు.

ఫ్లోరోసిస్ వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలి: ఫ్లోరోసిస్ వ్యాధి నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వైద్యాధికారులతో కలిసి దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి సూర్యనారాయణ, డీఎంహెచ్‌వో శ్రీహరి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఐశా, పావని తదితరులు పాల్గొన్నారు.

ఆయన 'అభినయా'లను నమ్మొద్దు

టీడీపీ నేత ఊకా విజయకుమార్

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో తిరుపతిని భ్రష్టుపట్టించిన ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన తనయుడు అభినయ్ రెడ్డిల మోసపూరిత మాటలు నమ్మొద్దని టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్ కుమార్ చెప్పారు. సోమవారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తిరుపతిలో 35వేల దొంగ ఎపిక్ కార్డుల కుంభకోణం వెనుక సూత్రధారులుగా ఉన్న వైసీపీ నేతలపై ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. ఈ విషయంలో అధికారులు బలైపోతున్నారని, కుట్రదారులు, లబ్ధిదారులు మాత్రం జల్సాగా ఉన్నారన్నారు. కరుణాకరరెడ్డి, అభినయ్ రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలే దొంగ ఓట్ల కుంభకోణంలో కుట్రదారులు, సూత్రధారులుగా విజయకుమార్ ఆరోపించారు. తిరుపతి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అభినయ రెడ్డి తనను గెలిపించాలని తిరుగుతున్నారని, ప్రజలు మోసపోవద్దని సూచించారు. అరాచకాలు, అక్రమాలతో తిరుపతి నగరం ప్రశాంతత దెబ్బతింటుందన్నారు. తిరుపతి నియోజకవర్గంలో పూర్తిగా దొంగ ఓట్లు తొలగించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు.



ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా పరిశీలనలో టీడీపీ

తిరుపతి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో దొంగ ఓట్లను గుర్తించడంలో భాగంగా టీడీపీ నేతలు సోమవారం 15వ డివిజన్ బైరాగిపట్టెడ భగత్‌సింగ్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు. పలు డబ్లింగ్ ఓట్లను గుర్తించి.. సంబంధిత బీఎల్వోకు ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ ఛైర్మన్ నరసింహ యాదవ్ మాట్లాడుతూ నగరంలో ఏ గడప చూసినా దొంగ ఓట్ల నిలయంగా వైసీపీ నేతలు మార్చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వీటిని తొలగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీధర్ వర్మ, నాయకులు చినబాబు, మహేష్ యాదవ్, బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, వార్డు నాయకులు రాము, భారతి, గుణ, జనార్ధన్, శంకర్, హరి, రవి, ప్రభాకర్, చక్రి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.


వివరాలను తెలుసుకుంటున్న సుగుణమ్మ, నరసింహయాదవ్ తదితరులు

కొనసాగుతున్న 'మెర్జింగ్' పనులు

ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్న జనం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 12: శ్రీనివాసం గెస్ట్‌హౌస్ ముందు శ్రీనివాస సేతుపై మెర్జింగ్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ర్యాంపుల కలయిక వద్ద ఏర్పడిన సందులను మూయడానికి నెల క్రితం ఈ పనులను ప్రారంభించారు. ఈ పనులు చేసేటపుడు వారధి కింద జనానికి ప్రమాదం తలెత్తకుండా తిరుమల బైపాస్ రోడ్డులో బారికేడ్లు పెడతారు. దీనివల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ట్రాఫిక్ లేనప్పుడు, రాత్రిపూట మాత్రమే పనులు చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. ఇకనైనా ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.


తిరుమల బైపాస్‌రోడ్డుపై పెట్టిన బారికేడ్లు

ధ్యానకేంద్రం ప్రారంభం

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 12: బైరాగిపట్టెడలోని పద్మావతి పార్కు సమీపంలో ధ్యాన కేంద్రం ప్రారంభించినట్లు ప్యూరిటీ ఆఫ్ లైఫ్ స్వచ్ఛంద సంస్థ తెలిపింది. సోమవారం ఉదయం జరిగిన ఈ ప్రారంభోత్సవంలో జె.రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. పరిపూర్ణానంద స్వామి, అరబిందో సొసైటీ ఉపాధ్యక్షుడు ఎం.వేణుగోపాల్, సంస్థ అధ్యక్షుడు గురుసర్కార్, గజేంద్ర బాబు, డాక్టర్ పార్థసారథి, ప్రసన్న, బాబూజీ తదితరులు పాల్గొన్నారు. ఈ కేంద్రంలో ధ్యానంతోపాటు యోగా, స్పోకెన్ ఇంగ్లీషు వంటి అంశాలను బోధించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



30వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలి

● ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 12: సీఎం జగన్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం 30వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధుయాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపుతో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. బాలాజీకాలనీ నుంచి ఎంఆర్‌పల్లెలోని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇల్లు ముట్టడికి ప్రయత్నించగా.. పోలీసులు అడ్డుకోవడంతో వెస్ట్ చర్చి సమీపంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చాక నాలుగున్నరేళ్లపాటు ఒక డీఎస్సీ కూడా ఇవ్వకుండా మోసం చేశారని మండిపడ్డారు. ఇపుడు తూతూ మంత్రంగా ఆరువేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మభ్యపెట్టడమేనని విమర్శించారు. నిరుద్యోగులు వైసీపీని గద్దెదించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికైనా మెగా డీఎస్సీ విడుదల చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.మల్లికార్జున, యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రేమ్‌సాగర్, నాయకులు సందీప్, శ్రీనివాస్, పవన్‌తేజ, జవీద్, ధ్రువకుమార్‌రెడ్డి, నరేష్, జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీగా వస్తున్న ఎన్ఎస్‌యూఐ నాయకులు

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: కలెక్టర్ లక్ష్మీశను సోమవారం నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మలికా గర్గ్ మర్యాదపూర్వకం గా కలిశారు. అలాగే స్పందన కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలిసి, తన నియోజకవర్గంలో పెండింగ్‌లో ని అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు.


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఎన్నికల నిర్వహణపై ఆర్వో, ఏఆర్వోలకు శిక్షణ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 12: ఎన్నికల నిర్వహణపై ఆర్వో, ఏఆర్వోలకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం పద్మావతి మహిళా వర్సిటీ సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఏపీ ఎన్నికల కమిషన్ అదనపు సీఈవో హరీంద్ర ప్రసాద్ ప్రారంభించి, ప్రసంగించారు. ఎన్నికల సంఘం తాజాగా జారీ చేసిన నియమావళిని కచ్చితంగా అనుసరించాలన్నారు. ఈనెల 16వ తేదీ దాకా కొనసాగే ఈ శిక్షణలో సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని చెప్పారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచల్‌కిషోర్, కమిషనర్ అదితిసింగ్, ఆర్డీవోలు, నిశాంత్‌రెడ్డి, చంద్రముని, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, నెల్లూరు, అనంతపురం, బాపట్ల, పల్నాడు, తదితర జిల్లాల జేసీలు, ఏఆర్వోలు పాల్గొన్నారు. మాస్టర్ ట్రైనర్లుగా అశ్విన్‌మాలిక్, బిజిత్‌కుమార్‌ధార్, జ్ఞానవేలు, శశిశేఖర్‌రెడ్డి, అచింత్యకుమార్ హజ్రా వ్యవహరించారు.


ప్రసంగిస్తున్న హరీంద్రప్రసాద్

రోడ్డు భద్రతా మాసోత్సవాల ర్యాలీ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 12: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ర్యాలీ నిర్వహించారు. తిరుపతి డిపో ముందు నుంచి అవుట్‌గేట్, అంబేడ్కర్ కూడలి మీదుగా గాంధీవిగ్రహం కూడలి నుంచి మళ్లీ బస్టాండులోకి ప్రవేశించారు. డిప్యూటీ సీటీఎం భాస్కర్, తిరుపతి, అలిపిరి డిపోల మేనేజర్లు బాలాజీ, హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సోక్రటీస్ ఐకాన్ స్కూల్ వార్షికోత్సవం

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 12: బైరాగి పట్టెడలోని సోక్రటీస్ ఐకాన్ హైస్కూల్ 38వ వార్షికోత్సవం సోమవారం మహతి ఆడిటోరియంలో నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అప్సా రాష్ట్ర అధ్యక్షుడు వి.సుబ్రమణ్యంరాజు, కార్యదర్శి రమణ, కరస్పాండెంట్ కె.ప్రదీప్‌రెడ్డి, టీచర్లు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోదండరామాలయంలో 16న రథసప్తమి వేడుకలు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 12: కోదండరామస్వామి ఆలయంలో ఈనెల 16వ తేదీన రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్టు టీటీడీ తెలిపింది. ఆ రోజున ఉదయం ఏడు గంటలకు సూర్యప్రభ వాహన సేవ జరగనుండగా, రాత్రి ఏడు గంటలకు స్వామి వారు చంద్రప్రభ వాహనంపై విహరిస్తారని పేర్కొంది.

కృష్ణభట్ సంస్మరణ సభ

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 12: తిరుపతిలోని వుడ్‌సైడ్ హోటల్ యజమాని కృష్ణభట్ ఇటీవల మరణించారు. ఆయన సంస్మరణ సభ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిలిమ్ సొసైటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, కార్యదర్శి శేషగిరిరావు, రాయలసీమ పోరాట సమితి నాయకుడు నవీన్‌కుమార్ రెడ్డి, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి, హోటల్స్ సంఘం నాయకుడు వెంకయ్య, కృష్ణభట్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



భక్తులతో సహనంగా మెలగాలి

● టీటీడీ ఉద్యోగులతో బీవీ పట్టాభిరామ్

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 12: తిరుమలలో శ్రీవారి దర్శనానికి విచ్చేసే సామాన్య భక్తులతో ఉద్యోగులు సహనంగా వ్యవహరించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ సూచించారు. సోమవారం శ్వేత భవనంలో టీటీడీ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఒత్తిడి అధిగమించడం ఎలా అనే అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మన చేతుల్లో ఉండే పనులను సక్రమంగా నిర్వహించడంపై ఉద్యోగులు దృష్టిపెట్టాలన్నారు. శ్వేత సంచాలకుడు భూమన్, ఎస్వీబీసీ అధ్యక్షుడు సాయికృష్ణయాచేంద్ర, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, సీవీఎస్వో నరసింహకిషోర్, టీటీడీ క్యాటరింగ్ అధికారి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.


పట్టాభిరామ్‌కు శ్రీవారి చిత్రపటాన్ని అందజేస్తున్న భూమన్, సాయికృష్ణ యాచేంద్ర, సిపాయి

ఎస్వీయూ విద్యార్థులకు పుస్తకాల వితరణ

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 12: తిరుపతి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎస్వీయూ స్కాలర్‌షిప్ విద్యార్థులకు సుమారు రూ.50వేల విలువచేసే పుస్తకాలను వితరణ చేశారు. ఎస్వీయూ లైబ్రరీ ద్వారా చదువుకోవడానికి ప్రోత్సాహిస్తూ దాదాపుగా 14రకాల 70పుస్తకాలను అందించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, లైబ్రేరియన్ సురేంద్ర, యోగా ప్రతినిధులు చంద్రమౌళి, కృష్ణ, సంఘం ప్రతినిధులు శ్రీధర్, శ్రీదేవి, రాధిక, హేమ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు విగ్రహం



తల్లి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారులు

దొరవారిసత్రం, ఫిబ్రవరి 12: ఏడాది గడిచినా.. వెళ్లిపోయిన అమ్మ తలపులు ఆ బిడ్డలను వదలడం లేదు. పేదరాలైన ఆ తల్లి పడ్డ కష్టం.. తమను పెంచి పెద్దచేసిన తీరు.. తమ ఉన్నతి కోసం ఆమె తాపత్రయం.. ఇవన్నీ రోడ్డు ప్రమాదంలో కన్నుమూసిన ఆ తల్లి కోసం తల్లడిల్లిన బిడ్డలు ఆమె జ్ఞాపకాలకు పదిలపరచుకోవాలనుకున్నారు. గత యేడాది జనవరి 24న నెల్లూరు జిల్లా కావాలి వద్ద జరిగిన కారు ప్రమాదంలో తమకు దూరమైపోయిన అమ్మను విగ్రహంగా మార్చుకుని తమ ఇంటి ఆవరణలో ప్రతిష్ఠించుకున్నారు. దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామంలో సోమవారాం నంచి రమణమ్మ(61) విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. విజయ్‌కుమార్, శ్యామ్, వినయ్‌కుమార్‌లకు అమ్మమీద ఉన్న ప్రేమానురాగాలను చూసి ఊరు అబ్బురపడింది. అతల్లి కష్టంతో పెరిగిన వీరిలో ఒకరు వ్యాపారి కాగా, మరో ఇద్దరు సాఫ్ట్‌వేరు ఇంజనీర్లుగా విదేశాల్లో స్థిరపడ్డారు. నంచి రమణమ్మ తెలుగుదేశం పార్టీ మండల మహిళా నాయకురాలిగా చురుకైన ప్రాత పోషించారు. సోమవారం టీటీడీ బోర్డు సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి రమణమ్మకి నివాళి అర్పించారు.

ఒక్కఛాన్స్‌తో రాష్ట్రం అధోగతి



కరపత్రాలను పంపిణీ చేస్తున్న పాశిం సంధ్యారాణి

గూడూరు, ఫిబ్రవరి 12: ఒక్కఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నమాజుకట్ట ప్రాంతంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిత్యవసరాల వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో గాడితప్పిన పాలనను సరిచేయాలంటే చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే మహిళలకు, యువతకు చంద్రబాబునాయుడు చేయూతనిస్తారన్నారు. రానున్న ఎన్నికలలో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో వాటంబేడు శివకుమార్, మధు, సయ్యద్, పులిమి శ్రీనివాసులు, అమరయ్య, అల్లీహుస్సేన్, మట్టం శ్రావణి, భారతి, కల్పన, నూర్జహాన్, సుధా తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12: సూళ్లూరుపేట పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయీస్ అధికారులు సోమవారం దాడులు చేసి అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా తమిళనాడు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని బొగ్గుల కాలనీ సమీపంలో ఓ మినీలారీలో ప్లాస్టిక్ గోతాల్లో కట్టిన బియ్యం బస్తాలు తరలించేందుకు ఉన్న 5,757 కిలోల బియ్యం బస్తాలు స్వాధీనం చేసుకొన్నట్లు సీఎస్ డీటీ ఓబయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దళితులను ముంచింది జగనే: నెలవల



కరపత్రాలను పంపిణీ చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, ఫిబ్రవరి 12: సీఎం జగన్ దళితుల సంక్షేమం కోసం ఒక్క పైసా ఖర్చు చేసిన ధాఖలాలు లేవని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ నెలవల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం మండలంలోని చింతపూడి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళితులపై దాడులు పెరగడంతో దళిత వర్గాలు ఎంతో చితికిపోయాయన్నారు. దళితులను ఆదరించి ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి వైపు నడిపించింది టీడీపీయేనని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, మీరయ్యనాయుడు, కృష్ణమనాయుడు, మునిరామయ్య, మునీష్, గురవారెడ్డి, పరుశురాం, కేవీనాయుడు, సురేష్‌నాయుడు, ఉదయ్‌నాయు, యుగందర్, గురవయ్య, సత్యనారయణ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మూడు ఆలయాల్లో చోరీ

బాలాయపల్లి, ఫిబ్రవరి 12: మండలంలోని చిలమనూరు పరిధిలో ఆదివారం రాత్రి మూడు ఆలయాల్లో చోరీ జరిగింది. చిలమనూరులోని పాండు రంగస్వామిగుడి, ఎస్సీ కాలనీలోని పాండు రంగస్వామి గుడి, మాతమ్మ గుడిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్ఐ మహబూబ్ సుభాని ఆలయాల్లో చోరీ జరిగిన తీరును పరిశీలించారు. మాతమ్మ గుడిలో అమ్మవారి తాళిబొట్టుతో కలిపి 18 గ్రాముల బంగారం, ఐదు వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు తెలిపారు.

పురుగుల మందుతాగి ఆత్మహత్య

కోట, ఫిబ్రవరి 12: కోట మండలం కేశవరం పంచాయతీ పరిధిలోని గల రాఘవాపురం గ్రామానికి చెందిన కొకొల్లు భాస్కర్(55) సోమవారం పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబకలహాల నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో భాస్కర్ పురుగుల మందుతాగి సమీప పొలాల్లో అపస్మారకస్థితిలో పడిపోయాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

నాయుడుపేట టౌన్, ఫిబ్రబరి 12: పట్టణంలో పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసిన నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం పదేళ్ల బాలికను ఒక వ్యక్తి తీసుకొని వెళ్తుండగా గమనించిన స్థానికులు దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



డాక్టర్ రాకపోవడంతో ఖాళీగా దర్శన మిస్తున్న కుర్చీ - ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న రోగులు

అత్తెసరు వైద్యమే

- వేళలు పాటించని వైద్యులు
- పేరుకే కాల్ డాక్టర్లు
- రాత్రి వేళ్లల్లో నర్సుతోనే వైద్యం
- డిప్యుటేషన్‌లో డీసీఎస్

డక్కిలి, ఫిబ్రవరి 12: డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో రోగులకు అత్తెసరు వైద్యమే అందుతోంది. 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి వున్నా అవేవీ ఇక్కడ అమలు కావడంలేదు. రాత్రివేళ్లల్లో ఏదైనా సమస్యతో ఆస్పత్రికి నర్సు మాత్రమే అందుబాటులో వుంటున్నారు. మండల ప్రజలకు మెరుగైన వైద్యం అందివ్వాలన్న ఉద్దేశంతో 1992లో అప్పటి ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డి అన్ని హంగులతో డక్కిలిలో ముప్పై పడకల ఆస్పత్రి నిర్మించారు. పదేళ్లపాటు ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలు అందేవి. ఆ తర్వాత వైద్యుల కొరతతో దీన్ని పీహెచ్‌సీ స్థాయికి తీసుకొవచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి వున్నా అవేవీ ఇక్కడ జరగడం లేదు. డిప్యూటీ చీఫ్ సర్జన్(డీసీఎస్)తో పాటు ముగ్గురు డాక్టర్లు పనిచేస్తున్నారు. డీసీఎస్ తిరుపతికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఆమె నెలలో కొద్ది రోజులు డక్కిలి ప్రభుత్వాస్పత్రిలో రోగులను చూడాల్సి వుంది. కానీ డీసీఎస్ ఇటువైపు రావడంలేదు. చివరికి ఉద్యోగులు జీతాలు బిల్లుల సంతకాలకు కూడా తిరుపతికి వెళ్లాల్సి వస్తోందని సిబ్బంది చెబుతున్నారు. ఇక ఇద్దరు జనరల్ డాక్టర్లతో పాటు ఒక డెంటిస్ట్ వున్నా వారు సమయపాలన పాటించడంలేదని రోగులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 9గంటల నుంచి ఔట్ పేషంట్ రోగులకు సేవలు అందించాలి. అయితే సోమవారం ఉదయం 11 వరకు ఆస్పత్రికి డాక్టర్లు ఎవరూ రాకపోవడంతో రోగులు ఎదురు చూడాల్సి వచ్చింది. సిబ్బందిని అడిగితే మహిళా వైద్యురాలు 104 సేవల్లో భాగంగా ఫీల్డ్ మీద వెళ్లారని చెప్పారు. డెంటిస్ట్ వారంలో మూడురోజులు గూడూరు మండలంలోని చెన్నూరు ఆస్పత్రిలో విధులు నిర్వహించాల్సి ఉన్నందున అక్కడికి వెళ్లారని తెలిపారు. 11 గంటల తరువాత ఒక డాక్టరు వచ్చి రోగులను చూశారు.

అందుబాటులో లేని కాల్ డాక్టర్స్

ఆస్పత్రిలో 24గంటలు వైద్య సేవలు అందించాలన్న నిబంధన ఏమాత్రం అమలు కావడం లేదు. రాత్రి వేళల్లో కేవలం ఒక నర్సు మాత్రమే అందుబాటులో వుంటున్నారు. స్థానికంగా నివాసం ఉండాల్సిన వైద్యులు వెంకటగిరి, తిరుపతిలో ఉంటున్నారు. రాత్రి వేళ ఏదైనా ప్రమాదం జరిగి ఆస్పత్రికి వస్తే వైద్యులు అందుబాటులో లేకపోతుండడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో 24గంటలు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలి: ఆనం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి

బాలాయపల్లి, ఫిబ్రవరి 12: వెంకటగిరి నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం భవనంలో బాలాయపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గూడూరు భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. మండలంలోని పలు గ్రామాల్లో సాగునీరు లేక పంటను వదిలేయాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోమశిల జలాశయం నుంచి ఐదు టీఎంసీల నీటిని కండలేరు జలాశయానికి కావాలని ఇటీవల నెల్లూరులో జరిగిన ఐఏబీ సమావేశంలో అధికారులు కోరక పోవడం వల్లే నీటి సమస్య ఎదురైందన్నారు. ఇప్పుడైనా ఇచ్చే ఒక్క టీఎంసీ నీటిని బాలాయపల్లి, డక్కిలి, వెంకటగిరి గ్రామాల పరిధిలో ఉన్న 2ఏ ,4ఏ, 5ఏ బ్రాంచ్ కెనాల్‌కు విడుదల చేయాలన్నారు. ఈ బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు రాకపోతే పంటలు ఎండిపోతాయన్నారు. అధికారులు నిర్లక్ష్యం కారణంగానే జయంపులో పీహెచ్‌సీ నిర్మాణంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రభుత్వ భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు ఇవ్వడంలేదని, దీంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదన్నారు. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వెంకటగిరి - చెన్నూరు రోడ్డు విస్తరణ పనులు తాను ఆపేసినట్లు కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడం వల్లే పనులు నిలిపివేయడం జరిగిందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళి, ఎంపీడీవో అరుణ, డిప్యూటీ తహసీల్దార్ శిరీష, ఏవో వినీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏదో ఒక పార్టీ నుంచి పోటీ చేస్తా

వచ్చే ఎన్నికల్లో ఏదో ఒక పార్టీ నుంచి వెంకటగిరిలో పోటీ చేస్తానని ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తనని ఆశీర్వదిస్తే సంక్షేమంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి అందరితో కలిసి పని చేస్తానని చెప్పారు. కొందరు విజ్ఞత మరచి తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, నియోజకవర్గంలో ఏ మండలానికి ఏం చేశానో అన్నీ వివరిస్తానని ఆనం అన్నారు.

వెంకటగిరికి ఏమి చేశారో ఆనం చెప్పాలి: రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 12: గత నాలుగు సంవత్సరాల్లో వెంకటగిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి ఏమి చేశారో చెప్పాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ప్రశ్నించారు. సోమవారం స్థానిక ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆనం కుటుంబానికి రాజకీయ భవిష్యత్తు ఇచ్చింది నేదురుమల్లి జనార్ధన రెడ్డేనని అన్నారు. వెంకటగిరి రైతుల సాగునీటి కోసం గంగ జలాలు కావాలని అధికారులకు చెప్పని ఆనం, ఎమ్మెల్యే హోదాలో ప్రోటోకాల్ ఉందని చెప్పుకుని సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

పోలీసులపై దాడి ఘటనలో అనుమానితుల విచారణ

వాకాడు, ఫిబ్రవరి 12: కోడి పందేలను ఆపమన్నందుకు పోలీసులపైనే దాడి చేసిన సంఘటనలో పలువురు అనుమానితులను సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో వాకాడు, కోట, చిట్టమూరు ఎస్‌ఐలు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పవన్ కుమార్ చెప్పారు.

మా భూములను కాపాడండి

బాధితుడి విజ్ఞప్తి

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 12:'కమ్యూనిస్టు పార్టీల పేరు చెప్పి.. కొంతమంది మా భూములను కబ్జా చేశారు. వెంటనే అధికారులు స్పందించి న్యాయం చేయాలి' అని బాధితుడు సిద్ధుల రవి విజ్ఞప్తి చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రేణిగుంట మండలం కరకంబాడి గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు. 153/1లో 44 ఎకరాల 95సెంట్ల భూమి పూర్వీకుల నుంచి తరతరాలుగా తమ కుటుంబీకుల ఆధీనంలో ఉందన్నారు. పైగా ఈ భూమిపై ప్రభుత్వానికి, తనకు కోర్టులో వ్యాజ్యం నడుస్తోందని చెప్పారు. ఇదివరకే కింది కోర్టులో అనుకూలంగా తీర్పు రావడంతో హైకోర్టుకు ప్రభుత్వం అపీల్ చేయడంతో ఇంజక్షన్ ఆర్డరు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు. అయితే కొంతమంది కమ్యూనిస్టు పార్టీల పేరు చెప్పి.. తమ భూముల్లో ఇతర జిల్లాలకు చెందిన వారు గుడారాలు వేసుకుని తిష్ఠ వేశారని వాపోయారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా కోర్టులో కేసు నడుస్తుండటం వల్ల ఈ భూమిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెళ్లకూరు, ఫిబ్రవరి 12: మండలంలోని జీలపాటూరు, చిల్లకూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తగిన సదుపాయాలు సక్రమంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దారు ప్రసాద్‌రావు, ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వో రమేష్, వీఆర్‌ఏలు కృష్ణ. సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో 2 జిల్లా కమిటీ ఎన్నిక



మించిల శంకరయ్య, సతీష్ బాబు, గున్నయ్య

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: ఎంఈవో 2 జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారుల సమావేశం జరిగింది. ఇటీవల ప్రభుత్వం ప్రతి మండలానికి ఎంఈవో-2ను నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎంఈవోలు కొత్త కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగా జిల్లా అధ్యక్షుడిగా మించెల శంకరయ్య, గౌరవ అధ్యక్షుడిగా బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా సతీష్ బాబు, కోశాధికారిగా గున్నయ్య తదితర సభ్యులను ఎన్నుకున్నారు.

విదేశీ మద్యం స్వాధీనం

తడ, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఒంగోలు వైపు వెళ్తున్న ఓ కారును తనిఖీ చేయగా సుమారు 15 బాటిళ్ల విదేశీ మద్యం లభ్యమైంది. కారులో ఉన్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిలో ఒకరు డ్రైవరు కాగా, మిగిలిన ముగ్గురు నెల్లూరు జిల్లా కావలికి చెందిన మన్నెపల్లి ప్రసాద్, ఒంగోలుకు చెందిన దాసరి రవికిషోర్, పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం అప్పణపేటకు చెందిన లచ్చిరెడ్డి వెంకటరావు గా తెలిసింది. వీరు థాయిలాండ్ నుంచి చెన్నై ఎయిర్ పోర్టుకు వచ్చారు. అక్కడి నుంచి కారులో స్వగ్రామానికి మద్యం తీసుకెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. ఈ నలుగురిపై కేసు నమోదు చేశారు.

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపండి

వెంకటగిరి, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు అన్నారు. వెంకటగిరిలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం 'షై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాక 2100 మంది యువకులు ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలు చేసుకోన్నారన్నారని తెలిపారు. రాష్ట్రంలో 24శాతం యువత ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎక్కువ శాతం మంది యువత డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన నాలుగన్నర ఏళ్లలో విద్యారంగం పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందన్నారు. యువత ఇప్పటికైనా మేలుకోకపోతే భావితరాల భవిషత్ ప్రశ్నార్థకంగా మారుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు ఉందో లేదో తెలుసుకోవాలని, లేకుంటే వెంటనే నమోదు చేసుకొని వచ్చే ఎన్నికల్లో ఓటు అనే వజ్రాయుధంతో అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ మాజీ చైర్మన్ పులికోట్లు రాజేశ్వరరావు, టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు కార్యనిర్వాహక కార్యదర్శులు చావా హేమంత్, సుకుమార్, అధ్యక్షుడు శివతేజ, నాని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత రామ్మోహనరావు మృతి



ఓజిలి, ఫిబ్రవరి 12: టీడీపీ సీనియర్ నేత కంకణాల రామ్మోహనరావు (81) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన పది రోజులుగా విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు కంకణాల సత్యవరప్రసాద్‌రావు టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. కుమార్తె అమెరికాలో ఉంటున్నారు. రామ్మోహనరావు మృతి పట్ల సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరసా రత్నంతో పాటు ఓజిలి మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, సీనియర్ నాయకుడు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య సంతాపం తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

చిల్లకూరు, ఫిబ్రవరి 12: మండలంలో తూర్పుకనుపూరు గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 15మద్యం సీసాలను సోమ వారం ఎస్ఐ అంజిరెడ్డి స్వాధీనం చేసుకున్నారు. కదిరి గ్రామానికి చెందిన ధర్మయ్య తూర్పుకనుపూరులో నివాసముంటున్నారు. అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో అదుపులోకి తీసుకుని 15సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోదీ పాలనలోనే గ్రామీణాభివృద్ధి



కేంద్ర ప్రభుత్వ పథకాలను పోస్టర్లను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12: ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశవ్యాప్తంగా ఉన్న పల్లెసీమలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని బీజేపీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు నిషిధరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తిరుమలకుప్పం, రాజులకండ్రిగలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీల ఖాతాలకి జమచేసి పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ప్రాధాన్యమిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఉజ్వల్ యోజన, గ్రామీణ సడక్ రోజ్‌గార్ యోజన తదితర కార్యక్రమాల ద్వారా పల్లెసీమల రూపురేఖలు మార్చిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందన్నారు. బలమైన భారత్ కోసం మళ్లీ నరేంద్రమోదీని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా కార్యదర్శి లక్ష్మీవర్మ, జిల్లా ఓబీసీ కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షుడు మధు, మండల కార్యదర్శి రాజేంద్ర, యోగి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 12: నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనకు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని శ్రీవిద్య డిగ్రీ కళాశాల కరస్పాడెంట్ డాక్టర్ గుంటి ఉమామహేశ్వర్ అన్నారు. తిరుపతిలో జరిగినా మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్రస్థాయి స్టాక్ హోల్డర్స్ మీటింగ్ 2024 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి వివిధ కంపెనీలలో ఉద్యోగవకాశాలు కల్పించడం అభినందనీయమన్నారు. విద్యాసంస్థల అధినేతలు, కరస్పాడెంట్లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సచివాలయ భవనం ప్రారంభం



పుత్తూరు, ఫిబ్రవరి 12: పుత్తూరు మండలం కేబీఆర్ పురంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని సోమవారం మంత్రి రోజా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, వైసీపీ నాయకులు రవీంద్ర, మాహీన్, జయప్రకాష్, లోకనాథం, భాస్కర్ యాదవ్ పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

పుత్తూరు, ఫిబ్రవరి 12: స్థానిక ధర్మరాజుల ఆలయ ఆవరణలో సోమవారం 4వ విడత ఆసరా చెక్కులను మంత్రి రోజా పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ హరి, ఎంపీపీ మునివేలు, మెప్మా అధికారి జ్యోతి, కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, వైసీపీ నాయకులు జయప్రకాష్, శంకర్ పాల్గొన్నారు.

ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 12: ప్రభుత్వం ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షురాలు హైమావతి, ఏసీటీయూసీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో ఆశా వర్కర్ల సమా వేశం నిర్వహించారు. ఆశా కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తించి కనీస వేతనంగా రూ.26 వేలు ఇవ్వడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. ఏఐటీయూసీ నాయకులు మహేష్, మారెమ్మ, భారతి, వెంకటరమణ, లీలావతి, హరిత, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల కళ్లకు వింతరోగం: భానుప్రకాష్



చిన్నరాజుకుప్పంలో భానుప్రకాష్‌తో అప్యాయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 12: వైసీపీ నాయకుల కళ్లకు వింతరోగం వచ్చినట్లుంది... పచ్చకామర్లు సోకిన వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు... ఏమీ చేయపోయినా ఏదో చేసినట్లు వాళ్ల కళ్లకు మాత్రమే కనిపిస్తున్నట్లుంది... అని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఎద్దేవా చేశారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు చిన్నరాజుకుప్పం, చెర్లోపల్లిలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమంలో బాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుందేలు గుట్ట దగ్గర ఉన్న టిడ్కో ఇళ్ల దగ్గరకు వెళ్లి చూడండి... చెర్లోపల్లి రోడ్డు దారుణ పరిస్థితి మీ కళ్లకు కనిపించడం లేదా... వేణుగోపాల్‌సాగర్ దుస్థితి మీ కళ్లకు మంచి లెన్స్‌ను ఉన్న అద్దాలను వేసుకుని చూడండి... నింద్ర, గాజులమండల్యం షుగర్ ఫ్యాక్టరీలు మూసివేత కనిపించడం లేదా.. ఎలాగూ శంకర్ నేత్రాలయా వాళ్లతో టై అప్ ఉన్నారు కదా... కాస్తా కళ్లకు పరీక్షలు చేసుకోండి అంటూ భానుప్రకాష్ సెటైర్లు వేశారు. ఈ ఐదేళ్లలో ఒక కుటుంబం మాత్రమే అభివృద్ధి చెందితే... మొత్తం నియోజకవర్గం అభివృద్ధి సాధించిందని భ్రమల్లో ఉండడాన్ని ఏమనాలి అని నిలదీశారు. నియోజకవర్గ ప్రజలు విజ్ఞులని, ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎవరు బాగుపడింది... ఎవరు నాశనమైంది వారి స్పష్టమైన అవగాహన ఉందని తేల్చి చెప్పారు. ఇకపై ప్రజలను మోసం చేయలేరని, బుద్ధి తెచ్చుకుని ప్రతిపక్షాల మీద విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. అలాగే రానున్న టీడీపీ జనసేన ప్రభుత్వంలో అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంతో పాటు నగరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా చిన్నరాజుకుప్పం, చెర్లోపల్లిలో పర్యటించిన భానుప్రకాష్‌కు అడుగడుగునా ఘన స్వాగతం లభించింది. మహిళలు ప్రతి ఇంటి వద్ద మంగళ హారుతులిచ్చి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్ఎన్ ధనపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్, వైస్ చైర్మన్లు యుగంధర్, ఆనంద్, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, రఫీ, డీఎస్ గణేష్, అశోక్, మాధవనాయుడు, బాబు కృష్ణకుమార్, నాగేంద్ర, వార్డు నాయకులు ప్రసాద్‌నాయుడు, బాబునాయుడు, రమేష్, వాణి, భూషణం, శేఖర్, విశ్వనాధం, నాగరాజు, జ్యోతి, గంగాధరం, భరత్, సిద్ధయ్య, బాలకృష్ణ, హరి తదితరులు పాల్గొన్నారు.



ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఉండాలి

పుత్తూరు టౌన్, ఫిబ్రవరి 12: విద్యార్థులకు క్రమశిక్షణ, సేవా భావం అలవడేందుకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఉండాలని నాగలాపురం ఎంఈవో రాజు తెలిపారు. సోమవారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ బిగినర్స్ కోర్సు శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంఈవో మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో అంకితభావంతో పనిచేసే సేవాతత్వం అలవడుతుందన్నారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ ట్రైనింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి జయరాం, వైస్ ప్రెసిడెంట్ కుప్పిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని మృత్యుంజయ సన్నిధిని అర్చకులు శుద్ధిచేశారు. అనంతరం భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో శాస్త్రోక్తంగా అభిషేకించారు. వేదమంత్రాలతో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జనసేన ఇంటింటి ప్రచారం



ఏర్పేడు, ఫిబ్రవరి 12: మేర్లపాక గ్రామంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత సోమవారం ప్రచారం చేశారు. జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మేర్లపాక దళితులు మాట్లాడుతూ పాగాలి వద్ద 34 మంది రైతుల నుంచి ప్రభుత్వం భూమి స్వాధీనం చేసుకుందని గుర్తుచేశారు. అలాగే మన్ననసముద్రం వద్ద రోడ్డు నిర్మాణానికి భూమి తీసుకుందన్నారు. పరిహారం ఇవ్వలేదని వాపోయారు.

'స్పందన' అర్జీలపై నిర్లక్ష్యం వీడండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీల విషయంలో నిర్లక్ష్యం వీడాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి 241 అర్జీలు వచ్చాయి. వీటిల్లో అత్యధికంగా రెవెన్యూ శాఖకే 184 రాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచనలిచ్చారు. కలెక్టర్‌తోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు.

15న స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: ఈ నెల 15న ఔత్సాహిక ఉపాధ్యాయులకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై ఒక్క రోజు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా కమిషనర్ రమేష్ బాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు... బిగినర్స్ కోర్సు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణ, గ్రామీణ, తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, కేవీబీపురం మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు హాజరు కావచ్చని తెలిపారు. పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో 15వ తేదీన ఉదయం 9:30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆత్మహత్య చేసుకున్న విద్యార్థికి నివాళి



వినయ్(ఫైల్‌ఫొటో)

తొట్టంబేడు, ఫిబ్రవరి 12: హైదరాబాద్‌లో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి మృత దేహానికి బొజ్జల బృందమ్మ నివాళులర్పించారు. శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు పేట దళితవాడకి చెందిన ధనపాల్, జయంతి దంపతుల కుమారుడు వినయ్(18) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో జేఈఈ మెయిన్స్‌కు శిక్షణ తీసుకునే వాడు. శనివారం అక్కడి హాస్టల్లో ఉరేసుకుని చనిపోయాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. వారు సోమవారం ఉదయం స్వగ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న బృందమ్మ వారికుటుంబ సభ్యులను పరామర్శించారు.

బలిజ భవన నిర్మాణానికి భూమిపూజ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: పట్టణంలోని అయ్యగారు చెరువులో బలిజ కమ్యూనిటీ స్థలంలో సోమవారం బలిజ భవన నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయ బలిజ భవనంగా నామకరణం చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బలిజ సంక్షేమ సంఘం నాయకులు కోలా ఆనంద్, విశ్రాంత న్యాయమూర్తి రాధాకృష్ణ, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి పాల్గొన్నారు.

ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన



ఏర్పేడు, ఫిబ్రవరి 12: ఏర్పేడు మండలంలోని చిందేపల్లి, దుర్గిపేరి ఓటర్లకు ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ మొదలి యార్, వీఆర్వో వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోపాలన్న పాలన తీసుకొద్దాం : సుధీర్‌రెడ్డి



చెల్లూరులో ప్రచారం చేస్తున్న సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి నియోజక వర్గంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి పాలన మళ్లీ తీసుకు రావడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఏర్పేడు మండలం చెల్లూరు గ్రామంలో సోమవారం ఆయన మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రచారం చేపట్టారు. టీడీపీ సీనియర్ నాయకులు పేరం ధనంజయులునాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి నాగరాజునాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పొన్నారావు, నాయకులు సతీష్ నాయుడు, గుణయాదవ్, రాచేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం



తహసీల్దారు గౌరీశంకర్, ఎస్ఐ నాగార్జునరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 12: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషిచేసిన ఇటీవల బదిలీ అయిన తహసీల్దార్ గౌరీశంకర్, ఎస్ఐ నాగార్జునరెడ్డి సేవలు చిరస్మరణీయమని వైసీపీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి అన్నారు. డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళుతున్న తహసీల్దారు గౌరీశంకర్, ఎన్నికల దృష్ట్యా బదిలీ అయిన ఎస్ఐ నాగార్జునరెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. అదే విధంగా ఇటీవల బాధ్యతలుచేపట్టిన తహసీల్దారు భారతి, ఎస్ఐ ప్రతాప్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం రాజు, సింగిల్ విండో ఛైర్మన్ హరిరెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ బొప్పల తిలక్, వైస్ ఎంపీపీ శ్యామల, మాజీ సర్పంచ్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.04 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ మేరకు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 72,256 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,021 మంది తలనీలాలు సమర్పించారు.

ఈబీసీ నేస్తానికి దరఖాస్తుల ఆహ్వానం

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 12: ఈబీసీ నేస్తం కోసం అర్హులైన మహిళలు ఈ నెల 15 తేదీ వరకు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు.

గ్రామ స్వరాజ్యమే లక్ష్యం

తొట్టంబేడు, ఫిబ్రవరి 12: గ్రామస్వరాజ్యమే వైసీపీ లక్ష్యమని ఎమ్మెల్యే బియ్యపు మదుసూధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని తొట్టంబేడు, కంచనపల్లి, చిట్టత్తూరు గ్రామాలలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలు, రైతుభరోసా కేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోండి



విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న ఎన్ఆర్ఐ సంస్థ సభ్యులు

ఏర్పేడు, ఫిబ్రవరి 12: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని పాపా నాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయకుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేసిన పుస్తక ప్రదర్శనను సర్పంచ్ లలిత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఎన్ఆర్ఐ వాసవి పుస్తక మిత్ర సంస్థ ద్వారా 835 పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

మాధవమాలలో వైపీపీ ప్రచారం

ఏర్పేడు, ఫిబ్రవరి 12: ఏర్పేడు మండలం మాధవమాల గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కిషోర్‌రెడ్డి, రమణయాదవ్, తిరుమలయ్య, కరీముల్లా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటాపట్టాలు ఇవ్వండి

రేణిగుంట, ఫిబ్రవరి12: వివేకానందకాలనీ సమీపంలోని ఇసుక కాలువ బంజరులో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు పుల్లయ్య, హరినాథ్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ఇంటిపట్టాదారులకు మండల పరిధిలో వున్న ప్రభుత్వ భూముల్లో స్థలాలు కేటాయించాలని కోరారు. అనంతరం పేదలు ఇచ్చిన అర్జీలను డీటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నరసింహారెడ్డి, సత్యరాజ్, సత్యశ్రీ పాల్గొన్నారు.

మృతదేహం అప్పగింత

రేణిగుంట, ఫిబ్రవరి12: కారు ప్రమాదంలో చనిపోయిన వృద్ధుడి మృతదేహాన్ని వారి బంధువులకు సోమవారం అప్పగించారు. రేణిగుంట అర్బన్ పోలీసుల కథనం మేరకు.. రేణిగుంట రైల్వే స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం మధ్యాహ్నం కారు ఢీకొని తమిళనాడులోని సేలానికి చెందిన ముత్తుస్వామి(77), ఆయన కుమారుడు శక్తివేలు (55) గాయపడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ముత్తుస్వామి మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

బీజేపీని గెలిపించండి



తొట్టంబేడు, ఫిబ్రవరి 12: వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజవర్గ కోకన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి కోరారు. మండలంలోని విరుపాక్షిపురం పంచాయతీలో పల్లెకుపోదాం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వెడెం కృష్ణయ్య, జిల్లా ఉపాధ్య క్షుడు గోపాల్, నాయకులు రవిఆచ్చారి, రమేష్‌యాదవ్, రవిచంద్ర పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12: బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దార్‌గా పీ ఎండీ అలీఖాన్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. డీటీ చంద్రబాబునాయుడు, సీనియర్ సహాయకులు నాగరాజు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై వచ్చారు.



గుల్ల తేలిపోయిన ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు

మూన్నాళ్ల ముచ్చట..!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి రోడ్డుకు ఈనెల 8వ తేదీన మరమ్మతులు చేసిన విషయం తెలిసిందే. ఐదేళ్ల నుంచి ప్రతిసారి రోడ్డుకు అతుకులు వేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ఈ ఏడాది కూడా మళ్లీ అతుకులు వేశారు. దీనిపై 9వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'ప్రభుత్వాస్పత్రి రోడ్డుకు మళ్లీ అతుకులు' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. అయినా నాసిరకం పనులను అలాగే కొనసాగించారు. ప్రతి ఏటా ఫిబ్రవరిలో ఇక్కడ రోడ్డు మరమ్మతులు చేయడం నాలుగు నెలల వ్యవధిలో మళ్లీ ఛిద్రం కావడం షరా మామూలే. అయితే ఈసారి మరింత నాసిరకంగా ఉండడంతో సరిగ్గా మూడు రోజులకే రోడ్డు గుల్ల తేలిపోయింది.

టీడీపీతోనే వన్నెరెడ్ల అభివృద్ధి



మాట్లాడుతున్న రెడ్డి వారి గురువారెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: టీడీపీతోనే వన్నెరెడ్ల అభివృద్ధి జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. శ్రీకాళహస్తిలోని తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో సోమవారం క్షత్రియ సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారెడ్డి మాట్లాడుతూ ఆదివారం వైసీపీ నాయకులు ఎమ్మెల్యే మధు సూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్ టీడీపీపై అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటు అన్నారు. టీడీపీ ఆవిర్భవించిన వెంటనే శ్రీకాళహస్తి శాసన సభ్యుడిగా రెడ్డి వర్గానికి అవకాశం కల్పించిందన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి తమ సామాజిక వర్గ ప్రజల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కూడా కేటాయించారని గుర్తుచేశారు. వైసీపీ నాలుగున్నర సంవత్సరాల పాలనలో వన్నెకుల క్షత్రియులను అక్రమ కేసులతో తీవ్రంగా వేధించలేదా అని ప్రశ్నించారు. మాజీ పురపాలక సంఘం ఛైర్మన్ రాధారెడ్డి క్రషర్ వ్యాపారాన్ని మూత వేయించ లేదా అని నిలదీశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు రవి, రాష్ట్ర యువత మీడియా ప్రతినిధి ప్రతాప్ రెడ్డి, పార్లమెంట్ బీసీ కార్యవర్గ కార్యదర్శి ఎమ్మెస్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొరై రాజ్ రెడ్డి పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న దాసరి జనార్ధన్

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12: ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతు నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించి ఆ చట్టాలను దొడ్డిదారిలో అమలు చేయ డం సిగ్గుచేటు అన్నారు. మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ భారత్ బంద్‌లో రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, రమణయ్య, కత్తి ధర్మయ్య, నాగరాజు, మురళి, మణి, ఆచారి, పోలయ్య, పద్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఈ నెల 16న భారత్‌బంద్‌ను రైతులు, కార్మికులు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి చంద్రబాబు పిలుపునిచ్చారు. వ్యవసాయ నల్లచట్టాలకు వ్యతిరేకంగా, ప్రభుత్వం రంగ సంస్థల విక్రయానికి నిరసనగా బంద్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం బంద్‌కు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

ఆర్థికసాయం చేసి అప్పులబారి నుంచి ఆదుకోండి



సీనియర్ సహాయకులకు అర్జీ ఇస్తున్న బాధితులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 12: అప్పుల బాధతో తన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడని తమ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని ఓ కుమారుడు రెవెన్యూ అధికారులను వేడుకున్నాడు. మండలంలోని వేణుగోపాల పురం గ్రామానికి చెందిన వెంకటేశు(38) వ్యవసాయం, పిల్లల చదువుల కోసం రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. పంట సరిగా రాక నష్టాలపాలయ్యాడు. అప్పులవారి నుంచి ఒత్తిడి ఎక్కువ కావ డంతో ఈ నెల 8వ తేదీన పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 9వతేదీ చని పోయాడు. ఈ క్రమంలో మృతుడి కుమారుడు కిషోర్ తన తాత సహదేవ నాయుడుతో కలిసి సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి విచ్చేశాడు. ఆర్థిక సాయంచేసి ఆదుకోవాలని కార్యాలయ సీనియర్ సహాయకులు నాగరాజుకి వినతిపత్రం అందజేశారు.

హోమ మండపం ప్రారంభం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి హోమ మండపాన్ని ప్రారంభించారు. ఆలయం లోని దక్షిణ గోపురం వద్ద ఉన్న రుద్ర, చండీ హోమ మండపాన్ని ఇటీవల జీర్ణోద్ధరణ చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం పాలక మండలి సభ్యులు కొండూరు సునీత నంద దంపతులు రూ.1.10లక్షలు విలువ చేసే వెండి దర్పణాన్ని ఆలయానికి ఎమ్మెల్యే చేతుల మీదుగా వితరణ చేశారు. ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాలక మండలి సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నిబంధనలు
శ్రీసిటీ డీఎస్పీకి వర్తించవా : సీపీఎం

సత్యవేడు, ఫిబ్రవరి 12: ఆరేళ్లుగా శ్రీసిటీలోనే విధులు నిర్వహిస్తున్న శ్రీసిటీ డీఎస్పీ జగదీష్ నాయక్‌ని ఎలెక్షన్ కమిషన్ బదిలీ చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి దాసరి జనార్ధన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఒకే జిల్లాలో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పనిచేసిన అధికారులను (ఎన్నికలతో ప్రమేయం ఉన్న వారిని) తక్షణమే బదిలీలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా శ్రీసిటీ డీఎస్పీని ఎందుకు బదిలీ చేయలేదని ప్రశ్నించారు. ఇటు రాజకీయ వర్గాలు కాని అటు అధికార యంత్రాంగం కాని శ్రీసిటీ డీఎస్పీని కదిలించలేని పరిస్థితి చూస్తుంటే వ్యవస్థలను కొందరు అధికారులు ఎలా మేనేజ్‌మెంట్ చేస్తున్నారో అర్థమవుతోందని జనార్ధన్ తెలిపారు.

దళారులు లేకుండా
నేరుగా పంట అమ్ముకోవచ్చు



మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

కేవీబీపురం, ఫిబ్రవరి 12: నైరూప్యలో భాగస్వాములు అయితే రైతులు తమ పంటలను నేరుగా ఆ సంస్థకే విక్రయించి మంచి ఆదాయం పొందవచ్చని వ్యవసాయ ఏడీ రమేష్ రెడ్డి తెలియ జేశారు. సోమవారం రాజులకండ్రిగలో రైతులకు నైరూప్య ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ రైతు బజార్, మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రమణ్యం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థ ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, పనిముట్లు నేరుగా కొనుగోలు చేసుకోవచ్చన్నారు. వాటిని ఇతర రైతులకు సరఫరా చేసి లాభాలు పొందవచ్చని తెలిపారు. అయితే రైతులు ముం దుగా రూ.2వేలు చెల్లించి సభ్యత్వం పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఓ మురళి కృష్ణ, హార్టికల్చర్ రాధారాణి, సెరికల్చర్, కళ్యాణ్, వెంకటాచలం, వెంక టేశ్వర్లు, వెంకటమునిరెడ్డి, నాగమణి, హరిబాబు, రైతులు పాల్గొన్నారు.

టైలర్స్ కాలనీలో భూ కబ్జాలపై చర్యలు తీసుకోండి



భూకబ్జాలపై కలెక్టర్‌కు విన్నవిస్తున్న చక్రాల ఉష

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12: శ్రీకాళహస్తి టైలర్స్ కాలనీలో భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు చక్రాల ఉష విజ్ఞప్తిచేశారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ లక్ష్మీశాకు టైలర్స్ కాలనీలో కబ్జాలపై బాధితులతో కలిసి ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ మా భూమిని ఆక్రమించాడు

'మా స్థలాన్ని దయాకర్ అనే కానిస్టేబుల్ ఆక్రమించి, మమ్మల్ని బెదిరిస్తున్నాడు. టైలరింగ్ వృత్తిదారులకు 1997లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబరులో 386/2లో ప్లాట్లు కేటాయించింది. మాకూ అలాగే ఓ ప్లాటు వచ్చింది. తర్వాత నా భర్త గుండెపోటుతో మరణించడంతో ఆ స్థలంలో ఇల్లు కట్టలేక పోయాం. పాచిపని చేసుకునే నాకు న్యాయం చేయండి'

- సెల్వి, శ్రీకాళహస్తి

పెండింగ్ జీతాలివ్వండి



నిరసన తెలుపుతున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 12: మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. మండలంలోని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలి పారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఏఐటీయూసీ గౌరవాధ్య క్షులు చిన్నిరాజ్ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ.26వేలకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సత్యవేడు నియోజకవర్గ అధ్యక్షులు అన్నాదొరై, మధ్యాహ్న భోజన సంఘం నాయకులు మునిచంద్ర, మునిరాజమ్మ, బుజ్జమ్మ పాల్గొన్నారు.